# నా పోస్టు

★

బె నా

అబ్బాయీ,

నా వుత్తరానికి సమాధానం వ్రాసావు కాదు. నీ క్షేమ సమాచారం తెలియకుండా నే నెల్లాగరా బ్రతకడం. అమ్మ కోరిక నెరవేర్చి సుఖపెట్ట లేనప్పుడు జవాబు గూడా వ్రాయడం ఎందుకనుకున్నావా. కానిరోజులు వచ్చి పడ్డాయి, యేం చేస్తావు. వారానికొకమాటైనా వ్రాస్తూ వుండు నాయనా!

నన్ను పిన్ని కనిపెడ్తోనేవుంది. పరాయి యింట్లో యింకా యెన్నాళ్లో. దాని పిల్లలకే సమృద్ధిగా దొరకడం లేదు. నా పొట్టగూడా పోషించే భారం యెంత కాలం వహించకలుగుతుందో. నాన్నగారు రివిన్యూ యిన్స్పెక్టరు చేసిన రోజులు జ్ఞాపకం చేసుకుంటే గుండె గుభాలు మంటోంది... బెంగపెట్టుకోకు మంచి రోజులు రాకుండా ఉంటాయా.

చిట్టికి మూడో నెలట కాదూ! షాహుకారుగారికి మీ అత్తగారు చెప్పారుట. ఈ మాత్రం నా చెవిని వెయ్య కూడదురా. నువ్వు పుట్టిన ఆరు నెల్లకే నాన్నగారికి రివిన్యూ యిన్స్పెక్టరయింది. అల్లాగే నీకూ పెద్ద ఉద్యోగం అవుతుంది మనవడ్నిరానీ. చిట్టి దగ్గర్నుంచి వుత్తరాలు వస్తున్నాయా?

తిరుగు టపాలో జవాబు కెదురు చూస్తూవుంటాను.

అమ్మ

* * *

ఏమండీ,

నన్ను మర్చిపోయినట్టే వున్నారు. పోస్టు బంట్రోతు గాడు మా వీధికే రావడం మానేసాడు.

ఆయనెవరో సెలవు పెడ్తారనీ, ఆ వుద్యోగంలో మిమ్మల్ని వేస్తారనీ చెప్తోవచ్చారే. అల్లాంటిదేమైనా అయిందా. హోటలు భోజనం గదా కాస్త ఆవకాయ పంపిద్దామనుకున్నాను. ఈ యేడు వూరగాయలే పెట్టద్దన్నారు నాన్నగారు. సరిపడ్డ బియ్యం కొనడానికే స్తోమత లేదట.

ఏమిటో ఎల్లాగోవుందండీ. మీరు ఒక్కరూ అక్కడ ఎంత యిదిగా వున్నారో. పోనీ, అత్తయ్యని దగ్గిరపెట్టుకో కూడదూ. యిల్లాంటి పరిస్థితీ అని చెప్పితే జమీందారుగారి బంగాళాలో గదీవసారా యివ్వకుండా వుంటారా?

నా వంట్లో బాగానేవుంటోంది. డోకులు వచ్చినప్పుడు కళ్లు తిరుగుతున్నాయి అంతే. 'మనోలా' పుచ్చుకుంటే కాస్త తేలిగ్గా వస్తుందిట. అయితే,...ఏం లేదు లెండి.

ఎంత వద్దనుకున్నా అడగవల్సి వస్తోంది. వీలుగా వుంటే చూడండి. ఒక్క నాలుగు రూపాయిలు పంపిస్తే మిల్లు చీర కొనుక్కుంటాను. తిండి లేకపోయినా ఫరవాలేదు కాని మానం కాపాడుకోడం దుర్లభంగావుంది. ఏం పాపిష్టిరోజులండీ యివి. సత్తెమ్మగారింట్లో దొంగలు పడ్డారు. వెండి కంచాలు మానేసి బట్టలపెట్టెలు ఖాళీచేసి వెళ్లారు. మీ పాత పంచలైనా నా దగ్గరలేవు రాత్రిళ్లు కట్టుకుందును.

చిన్నిగాడికి ఏం పేరు పెట్టాలో ఆలోచించారా. వాడిని ఎత్తుకు తిరుగుతోన్నట్టే కలలు కంటున్నాను. వెంటనే వుత్తరంమటుకు వ్రాయండి సుమీ.

చిట్టి

* * *

(పేజీ తిప్పండి)

# నా పోస్టు

మిత్రమా,

ఎప్పుడూ చెప్పావే కాదు. నిన్న శాస్త్రిల్లు నీ రచనలను వినిపించాడు. నా మనస్సూ, నేనూ ఎక్కడికో ఎగిరి పోయాం. ముండావాళ్లకి ఎన్ని బిరుదులుంటేనేం! నీ కాలి గోరుకి బలాదూర్.

అన్నట్టు, నన్నూ నువ్వు అభినందించాలి. ఆ గోష్ఠికి యీ సంవత్సరం నేను అధ్యక్షుణ్ణట. ఏమైనా నాలుగు ముక్కలు వ్రాసి పెద్దూ. అక్కడ ప్రెస్సు సౌకర్యంవుందని నిన్ను యిబ్బంది పెట్టవలసివచ్చింది. ఏమీ అనుకోకేం.

మా అన్నయ్య దగ్గరనుంచీ యివాళే వుత్తరం వచ్చింది. రెండుమూడు నెలలలో ఆ భాగం ఖాళీ అవుతుందట. తప్పకుండా నీ కా సదుపాయం చేస్తానులే.

సుందరం

*　　　*　　　*

ఆర్యా,

శ్రీవారికి తాము వ్రాసిన లేఖలు అందినవి. బాల్యస్నేహాన్ని వారు మరువలేదని వ్రాయమన్నారు. మీ వ్రాత ప్రతిని రిజిస్టర్డు పోస్టు ద్వారా పంపివేస్తున్నాను. క్లిష్ట సమస్యా పరిష్కారానికై ప్రతి ఘడియా వినియోగించ వలసిన యీ రోజుల్లో మీ గ్రంథాన్ని చదివి ఉపోద్ఘాతం వ్రాయడానికి తీరిక లేనందుకు విచారిస్తున్నారు.

కార్యదర్శి

*　　　*　　　*

అయ్యా, అమ్మా,

నా స్వగృహ ప్రవేశ మహోత్సవ సందర్భమున రేపు జేనియ్య బోయే విందుకు తాము తప్పక దయచేయ ప్రార్థితులు. ఏ తత్శుభముహూర్తమున నూతన భవనమునకు శ్రీ ప్రజా మంత్రిగారు "సుఖనివాస్" అని నామకరణము చేయుటకు దయతో నంగీకరించినారు.

తమవిధేయుడు

మరా :—ముందుగా మీ రేవను పంపండి.

*　　　*　　　*

★

## ఆంధ్ర మహిళాసభ గ్రంథాలయం

### 'హిందూ'కు కృతజ్ఞత

రచయితలు, పత్రికలు, ప్రచురణాలయాలు వారి గ్రంథాలను మాకు యిచ్చి మా గ్రంథాలయమును అభివృద్ధి చేయాలని జూన్ మాసపు ఆంధ్ర మహిళలో విజ్ఞప్తిని ప్రకటించినాము. ఈ విజ్ఞప్తిని మన్నించి 'హిందూ' పత్రిక సుమారు వెయ్యి తెలుగు గ్రంథములను మా గ్రంథాలయమునకు పంపించింది. ఆ పత్రిక యజమానులకు మా కృతజ్ఞతా వందనములు.

హిందూవలె తెలుగు పత్రికలుకూడ మాకు తోడ్పడుతే మదరాసులో తెలుగు గ్రంథాలయ నిర్మాణం వెంటనే జరుగుతుంది.

గ్రంథాలయ కమిటీ